కథ

# అంకురం

- బుద్ధి యజ్ఞమూర్తి

''నాకైతే భరద్వాజను చూస్తుంటే డౌటుగానే ఉంటుంది'' అన్నాడు చిరంజీవి 'అంకురం'లోకి అడుగు పెడుతూ.

''ఏంటి నీ డౌటు?'' అడిగాడు బసవరాజు నేరేడు చెట్ల మీదుగా వస్తున్న చల్లటి గాలిని ఆస్వాదిస్తూ. ఆ ఇద్దరూ మంచి మిత్రులూ, వ్యాపారవేత్తలుగా పేరు పొందినవాళ్లూనూ.

''ఇది పేరుకి అనాథ శరణాలయమే కానీ, ఇక్కడ జరగకూడని పనులు జరుగుతున్నాయనేది నా అనుమానం''

''జరగకూడని పనులంటే?''

''ఇక్కడ పనిచేసే ఆయాలతో అతనికి సంబంధాలున్నాయని విన్నా''

''మంచి పనులు చేసే వాళ్ల మీద బురద చల్లడానికీ, రాళ్లు విసరడానికీ పనీ పాటాలేని కొంతమంది ఎప్పుడూ రెడీగా ఉంటారు చిరంజీవీ. భరద్వాజ నువ్వనుకుంటున్న రకం మనిషి కాదు''

''నువ్వంత గట్టిగా ఎట్లా చెప్పగలవ్. నువ్వేమన్నా కనిపెట్టుకుని చూస్తున్నావా. అతనికి తరగనంత ఆస్తి ఉంది. పెళ్లీ పెటాకులూ లేకుండా ఊరకే సమాజ సేవ చేయడానికి ఆయనేమన్నా మహాత్ముడా. మనలాగే ఉప్పూ, కారం తింటున్న మనిషేగా. పైగా ఇంకా వయసులోనే ఉన్నవాడేనాయె'' చులకనగా తీసిపారేశాడు చిరంజీవి.



''ష్.. చిన్నగా. దగ్గర కొచ్చేశాం'' అన్నాడు చిన్నగా బసవరాజు.

కొన్ని గజాల దూరంలో వరండాలోని పేము కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చదువుతూ కనిపించాడు భరద్వాజ. అప్పుడే ''అయ్యా'' అంటూ ఒక ఐదేళ్ల పిల్లాడు ఆయన మీద కెక్కి ఒళ్లో కూర్చున్నాడు. ఆయన చేతిలోని పుస్తకం కిందపడిపోయింది.

''అరెరే.. అంత తొందరేమిటి చిన్నా'' అని పుస్తకాన్ని తీసి పక్కనే ఉన్న స్టూలు మీద పెట్టాడు భరద్వాజ. పిల్లాణ్ణి ఒళ్లో కూర్చో పెట్టుకుంటూ ఎదురుగా వస్తున్న ఇద్దరు మనుషుల్ని చూశాడు.

''బసవరాజు గారా.. రండి రండి'' అంటూ ఆహ్వానించాడు. 'అంకురం'కి బసవరాజు ఆర్థికంగా సాయపడుతుంటాడు. ఒకసారి 'అంకురం'ని చూడాలని ఉందంటే చిరంజీవిని వెంట తీసుకువచ్చాడు.

బసవరాజూ, చిరంజీవీ అక్కడే ఉన్న పేము కుర్చీల్లో కూర్చున్నారు. చిరంజీవిని పరిచయం చేశాడు బసవరాజు.

ఒళ్లోని పిల్లాడు ''అయ్యా నేనాడుకుంతా'' అని దిగి పరిగెత్తాడు. ముచ్చటగా ఆ పిల్లాడివైపే చూశాడు భరద్వాజ.

''ఎలా ఉన్నారు మీరు? ఆశ్రమం ఎలా నడుస్తోంది?'' అడిగాడు బసవరాజు.

''నా ఆరోగ్యానికేంటి. ఇంకా ముసలోణ్ణి కాలేదుగా'' అంటా నవ్వి, ''మీలాంటి మంచి మనుషుల సహకారంతో ఆశ్రమం బాగానే నడుస్తోంది. పిల్లలు కూడా రెండొందల మంది దాకా అయ్యారు'' చెప్పాడు భరద్వాజ.

అంతలో ఒక పాప వొచ్చి ''అయ్యా నా ప్రోగ్రెస్ కార్డు'' అంటా ఇచ్చింది. తెరచి చూసి, ''85 పర్సెంట్. గుడ్. నువ్వు తలచుకుంటే 90 పర్సెంట్ కూడా వస్తాయి'' అని ఆ పాప నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు.

''అలాగేనయ్యా. ఇంకా బాగా చదువుతా'' అని వెళ్లింది ఆ అమ్మాయి.

భరద్వాజ మొహంలోని ప్రశాంతతకీ, తేజస్సుకీ ఆశ్చర్యపడ్తా ''మీకు పిల్లలంటే బాగా ఇష్టంలాగుంది'' అన్నాడు చిరంజీవి.

''చాలా చాలా ఇష్టం చిరంజీవిగారూ''

''మరి పెళ్లి చేసుకుని మీరూ పిల్లల్ని కనొచ్చు కదా?''

కొద్ది క్షణాలు మౌనంగా ఆలోచిస్తున్నట్లు ఉండిపోయి ''అప్పుడు ఇంతమంది పిల్లలకి తండ్రినయ్యే అవకాశం రాదుగా'' అని నవ్వాడు భరద్వాజ.

''సాధారణంగా 'నేనూ, నా కుటుంబం బాగుంటే చాలు' అనుకునే సొసైటీ మనది. అలాంటిది మీరు మీ గురించీ, మీ సుఖ సంతోషాల గురించీ ఆలోచించకుండా, మీకంటూ సొంత కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోకుండా ఇలా అనాథ పిల్లల్ని చేరదీయాలనే ఆలోచన ఎందుకు వచ్చింది? తలచుకుంటే విలాసవంతంగా బతకదగ్గ బ్యాక్‌గ్రౌండ్ ఉంది మీకు'' భరద్వాజ మొహంలోకి చూస్తూ అన్నాడు బసవరాజు.

అప్పుడే ఒక ఆయా అటువేపుగా పోతుంటే ''రేఖమ్మా'' అని పిలిచాడు భరద్వాజ. ఆమె ''ఏంటయ్యా'' అంటా దగ్గరకొచ్చింది.

''ఆ బాబుకి ఇప్పుడెలా ఉంది?'' అడిగాడు.

'ఫర్వాలేదయ్యా. ఇంతకుముందే కాస్త అన్నం తిన్నాడు'' చెప్పింది.

''జాగ్రత్తగా చూస్తుండండి'' అని ఆయన అనగానే ఆమె సరేనంటూ తలూపి వెళ్లిపోయింది.

తన వంక ప్రశ్నార్థకంగా చూస్తున్న ఆ ఇద్దరి వొంక చూస్తూ ''నాల్రోజుల క్రితం ఓ సినిమా హాలు వద్ద స్పృహ లేకుండా పడి ఉన్న ఓ అనాథ పిల్లాడిని తీసుకువచ్చాం. అతనికి టైఫాయిడ్. కాస్త ఆలస్యమైతే ప్రాణాలు



పోయ్యేవని డాక్టరన్నాడు. ఆ అబ్బాయి గురించే నేనడిగింది'' చెప్పాడు భరద్వాజ. 'చూశావా' అన్నట్లు చిరంజీవి వొంక చూశాడు బసవరాజు.

''ఇందాక మేమడిగిన దానికి జవాబు చెప్పనేలేదు మీరు'' అన్నాడు బసవరాజు.

''ఏదీ.. ఓ.. ఈ 'అంకురం'ని ఎందుకేర్పాటు చేశాను, ఎందుకు పెళ్లి చేసుకోలేదనేగా మీ ప్రశ్న, అది చెప్పాలంటే నా కథంతా చెప్పాలి'' అని ఆగాడు భరద్వాజ.

''చెప్పండి. మీ కథ తెలుసుకోవాలనే ఆసక్తితోటే అడిగాం'' అన్నాడు చిరంజీవి. అతనికి చాలా ఆరాటంగా ఉంది, భరద్వాజ కథ వినాలని.

చెప్పడం ప్రారంభించాడు భరద్వాజ.

***

అప్పట్లో మా నాన్న అనంతమూర్తి పోలీసాఫీసర్. డీఎస్పీగా పనిచేసేవాడు. ఇంటిపట్టున ఎక్కువసేపు ఉండేవాడు కాదు. మా అమ్మ శ్రీలక్ష్మికి పేరుకు తగ్గట్లే ఆడంబరం జాస్తి. ఎప్పుడూ క్లబ్బులనీ, వాటి కార్యక్రమాలనీ తిరుగుతూ ఉండేది. స్కూలు నుంచి వచ్చిన నేను అమ్మానాన్నలతో కాసేపైనా గడపాలని ఆశపడేవాణ్ణి. కానీ సాధ్యపడేది కాదు. వాళ్లు కూడా నాతో గడపాలనీ, నా ఆలనా పాలనా చూడాలనీ అనుకునేవాళ్లు కాదు. అమ్మనాన్నల కోసం వచ్చేవాళ్లతో మా ఇల్లు తరచూ సందడిగా ఉండేది. కానీ ఆ సందడి నాకేమీ సంతోషాన్నిచ్చేది కాదు. ఎందుకంటే వాళ్లలో నన్ను పట్టించుకునే వారు ఎవరూ ఉండరు. దాంతో నేను సరిగా చదవలేక పోయేవాణ్ణి. అమ్మానాన్నల ప్రేమ కోసం అర్రులు చాచేవాణ్ణి.

ఏడవ తరగతిలో సహజంగానే మార్కులు తక్కువ వచ్చాయి. నాకు చదువు మీద కాకుండా ఆటల మీదా, ఇతరత్రా ధ్యాస ఎక్కువైందని అమ్మానాన్నలు తీర్మానించుకున్నారు. నన్ను విజయవాడలోని ఓ రెసిడెన్షియల్ స్కూలులో చేర్పించారు. చేర్పించడానికి నాతో స్కూలుకి వచ్చింది మా అమ్మకానీ, నాన్న కానీ కాదు. మా బాబాయి.

హాస్టల్లో తొలిరోజు రాత్రంతా ఏడుస్తూనే ఉన్నా, పరుపు మీద పడుకుని. ఇంట్లో ఉంటే రోజుకోసారన్నా అమ్మానాన్నల్ని చూసుకునేవాణ్ణి. ఇప్పుడు ఆ అవకాశం కూడా లేకపోయిందని బాధ. అసలే సున్నిత మనస్కుణ్ణయిన నాలో అమ్మానాన్నలకు దూరమయ్యానన్న ఆలోచనతో అంతులేని వేదన. ఎప్పుడూ ఇల్లూ, ఇంటి దగ్గర నేనాడుకునే స్నేహితులు గుర్తుకొచ్చేవాళ్లు.

సహజంగానే అది శారీరక, మానసిక ఆరోగ్యం మీద ప్రభావం చూపింది. ఎప్పుడూ నీరసంగా కనిపిస్తున్నానని ఒక మాస్టారు నన్ను 'నీరసరాయుడు' అని పిలిచాడు. అప్పట్నించీ నా తోటివాళ్లు 'నీరసరాయుడు.. నీరసరాయుడు' అని ఆటపట్టించడం మొదలుపెట్టారు. అప్పుడెంత ఉక్రోషం కలిగేదో చెప్పలేను. నాకా పేరు పెట్టిన మాస్టారి మీద చెప్పలేనంత కోపం వచ్చింది.

ఒకసారి ఆయన ఏదో అడిగాడు. నేను జవాబు చెప్పలేకపోయా. దగ్గరకు రమ్మని, వొచ్చాక చేయి చాపమన్నాడు. బెత్తంతో గట్టిగా కొట్టాడు, అరచేతి మీద కాదు, వెనకవైపు. ఎముకలు విరిగిన భావన. నొప్పికి విలవిల్లాడా. అంతదాకా అంతగట్టిగా ఎవరూ నన్ను కొట్టలేదు. అప్పటికే ఆయనమీదున్న కోపం ఒక్కసారిగా బయటకొచ్చింది. ఏం చేస్తున్నానో తెలీని ఆవేశంతో ఆయన చేతిని గట్టిగా కొరికేశా. ఆయన కెవ్వున అరిచాడు. మణికట్టుపైన నా పంటిగాట్లు. నెత్తురు కారుతోంది.

అది చూసి భయంతో క్లాసురూములోంచి బయటకి పరిగెత్తా. మాస్టారు పురమాయింపుతో మిగతా పిల్లలు నా వెంటపడి పట్టుకున్నారు.

''మాస్టార్ని కండ ఊడొచ్చేట్లు ఎందుకు కొరికావ్?'' అనడిగారు ప్రిన్సిపాల్. జవాబు చెప్పాలని ఉన్నా ఎందుకో మౌనంగా ఉండిపోయా.

శిక్షగా ఆ రోజంతా ఎర్రటి ఎండలో నిలబెట్టారు నన్ను. అసలే మార్చి రోజులు. ఎండలు అప్పుడే పెరుగుతున్నాయి. ఆ సూర్యతాపాన్ని తట్టుకోలేక ఎంత కష్టపడ్డానో. దాహంతో గొంతు పిడచగట్టుకుపోయింది. కళ్లు తిరిగి పడిపోయా. నీళ్లు చల్లి, నేను కళ్లు విప్పాక ''ఇంకోసారి ఇలాంటి పని చేస్తే స్కూలు నుంచి డిస్మిస్ చేసేస్తా'' అని హెచ్చరించారు ప్రిన్సిపాల్.

ఆ ఉదయాన్నే మా నాన్న ప్రత్యక్షం. ప్రిన్సిపాల్ ఆయన్ని పిలిపించాడన్నమాట. వచ్చీ రాగానే ''ఏరా! ఇక్కడ కూడా నా పరువు తీయడమే ధ్యేయంగా పెట్టుకున్నావా?'' అని వీపు వంచి గట్టిగా పిడిగుద్దులు గుద్దాడు. ఎంత గట్టిగా అంటే కొంత సేపటిదాకా నిటారుగా నిల్చోలేకపోయా. అంత నొప్పి.

ఆ సంఘటన నా మనసుపై బాధాకరమైన ముద్ర వేసింది. అమ్మానాన్నల ప్రేమకు నోచుకోలేక పోయినందుకు నామీద నాకే ఒక రకమైన అసహ్యం. దాంతోపాటే ఎదుటి వాళ్ల పట్ల నిర్లక్ష్య భావం.

ఇంటర్మీడియేట్‌కొచ్చాను. హైస్కూల్లో మాదిరిగానే అక్కడా నేనెవరికీ స్నేహితుణ్ణి కాలేకపోయా. ఒంటరిగా గడపడానికే ఇష్టపడుతూ వొచ్చా. నలుగురిలో కలిసే వాణ్ణి కాదు. అందరిలో మాట్లాడాలంటే బెరుకు. క్లాసులవగానే చాలామంది నా తోటి స్టూడెంట్స్ షికార్లకీ, సినిమాలకీ వెళ్లేవాళ్లు. నేను మాత్రం ప్రకాశం బ్యారేజి కిందకెళ్లి కృష్ణ ఒడ్డున ఇసుకలో పడుకుని, ఆకాశంలో ఎగిరే పక్షులతోటీ, చీకటి పడ్డాక చుక్కలతోటీ మాట్లాడుతుండేవాణ్ణి.

విజయవాడలోనే ఇంటర్మీడియేట్, బీయస్సీ పూర్తి చేశా. ఆ తర్వాత ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఆంధ్రా యూనివర్శిటీలో చదివా.

''ఏం చేయదలచుకున్నావు?'' అని మా నాన్న అడిగాడు. ఉద్యోగంలో చేరతానన్నా. అప్పటికే ఆయనకి నా మీద పీకల్లోతు కోపం. నేను ఐపిఎస్ ఆఫీసర్ కావాలని ఆయన ఆశించాడు. నాకెందుకో పోలీస్ యూనిఫామ్ చూస్తే ద్వేషం. ''నీ ఇష్టమొచ్చినట్లు చేసుకో'' అన్నాడు కటువుగా.

విజయవాడలోని ఓ జూనియర్ కాలేజీలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా జాయినయ్యా. రామలింగేశ్వర నగర్‌లో ఒక్కణ్ణే ఒక రూమ్ తీసుకున్నా. ఒక సాయంత్రం కృష్ణ ఒడ్డుకెళ్లి వస్తూ పేవ్‌మెంట్ మీద నడుస్తున్నా. అప్పటికే బాగా చీకటి పడింది. ఇంతలో సన్నటి మూలుగు వినిపించి ఆగా. చినిగిపోయిన రగ్గు లోపల్నించి అది వినిపిస్తున్నట్లు అర్థమై, రగ్గుని నెమ్మదిగా పైకెత్తా. పది పన్నెండేళ్ల పిల్లాడు. వొణికిపోతున్నాడు. నుదుటి మీద చేయి పెట్టా. కాలిపోతోంది. అప్పుడు గమనించా, స్ట్రీట్ లైట్ వెలుతుర్లో అతడి మొహం మీద గాయాలు.

అంతదాకా కళ్లు మూసుకుని వున్న ఆ కుర్రాడు కళ్లు తెరిచి, నన్ను చూసి మళ్లీ తలనిండా రగ్గు కప్పుకున్నాడు, వొణికిపోతూనే. అతను అనాథ పిల్లాడని అతని వాలకం తెలియజేస్తోంది. ఆ దెబ్బలు ఎలా తగిలాయో..

''బాబూ ఆస్పత్రికి తీసుకెళ్తా వొస్తావా?'' అన్నా.

రగ్గులోంచి తల బయటపెట్టి అపనమ్మకంగా చూశాడు ఆ అబ్బాయి.

''నీ పేరేంటి?'' అనడిగా.

''రంగా''

రిక్షాలో రంగాని దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకుపోయా. డాక్టరు గాయాల్ని శుభ్రంచేసి, రెండు ఇంజక్షన్లు వేసి, టాబ్లెట్లు రాసిచ్చాడు. ''రేపు సాయంత్రం ఓసారి తీసుకు రండి'' అన్చెప్పాడు.

ఆ రాత్రి రంగాని ఆ పేవ్‌మెంట్ మీద వొదలాలనిపించలేదు. నా రూముకి తీసుకుపోయా. ఇడ్లీ తినిపించి పడుకోబెట్టా.

పొద్దున నిద్రలేచి, నాకు కృతజ్ఞతలు ఎలా చెప్పాలో తెలీక తికమకపడ్డాడు. ఇలాంటి అనుభవం అతనికి కొత్త. నాకది అర్థమైంది. అతని గురించి అడిగితే చెప్పాడు.

''నేను మెస్సులో పన్చేస్తున్నా సారూ. టేబిలి మీద ప్లేట్లు తీసి, శుభ్రంచేసే పని. నిన్న మెస్సులో జనం బాగా ఉన్నారు. ప్లేటింకా తీయకముందే కుర్చీలో ఒకా

కవిత



## చలన శీలం

కాలిగోటి కవచపు అంచైనా
కంటి రెప్పల్లో దోపుకున్న దృక్కోణాల్లోంచి
విసరు చూపు మొనైనా
తల్లి పొట్టలోని శిశువు ఆవులిస్తే
చిన్న పెదాల మీద చిట్లిన మాయి పొరల
చిటికెడు నవ్వులానైన ఆడాలె.

వాక్యాడంబరాల చుట్టూ అల్లుకున్న
భావ ప్రవాహ నురగలు,
వెన్నెల ముఖంమీద ముప్పిరిగొన్న
నిశి నిశ్శబ్దపు మబ్బు తొణుకులు
విసనకర్ర విసురుకు
కొమ్మ చివరాకు చెంప సొట్టలోంచి
జారుతున్న కాంతి బొట్టులానైన కదలాలె.

గుహ ద్వారాన్ని బండరాతితో కప్పెట్టి
ఊపిరి వూసులతో దాగుడు మూత లాడొద్దు
కనుబొమల రెంటి నడుమ
ఎక్కుపెట్టిన భృకుటి శరీరాన్ని
నాసికా రంధ్రాలోచనల్ని మూస్తూ, బాధించకు

గుండె బిలం నుండి
బిలబిలమంటూ స్కూల్ పిల్లల నిష్క్రమణ వరద
దేహం, వొట్టి శ్వేత పత్రమే!
ఎవరో
ఆకాశాన్ని పట్టి ఊపినట్టు
ఆశల ముసురు కింద
తహతహల భూమి కాయంలో
ఒక కదలిక మొదలవ్వనీ..
పదను గాయాల
గెంతుల అడుగుల చప్పుళ్ళకు
హరివిల్లు పాట అల్లుకోనీ..

–దాసరాజు రామారావు
9618224503

యన కూకున్నాడు. నాకేమో అప్పట్కే జొరంగా ఉంది. రాలేనంటే వోనరు కుదరదన్నాడు. వొంట్లో బాలేక పోవడం వల్ల నాకు చాలా నీరసంగా ఉంది. ప్లేటు తీత్తనప్పుడే పక్కనుండి ఇంకోకాయన పోతా నన్ను తగిలాడు. దాంతో నా చేయి ప్లేటుకి తగిలి, అది కుర్చీల్లో కూర్చున్నాయన మీద పడింది. ఆయన గట్టిగా అరచి నన్ను కొట్టాడు. ఓనరు కూడా ఆయన తట్టే మాట్లాడి వెళ్లిపొమ్మని గట్టిగా బయటకి తోశాడు. బయట నిలబెట్టున్న మెస్సు బోర్డు మీద పడ్డా. ఈ దెబ్బలయ్యే''.

అప్పటికి వాడి జ్వరం తగ్గింది. అయినా నీరసంగా కనిపిస్తున్నాడు.

నేను కాలేజీకి రెడీ అవుతుంటే వెళ్లిపోతానన్నాడు. సాయంకాలం డాక్టరు రమ్మన్న సంగతి చెప్పి రూములోనే ఉండమన్నా.

వాడు కళ్లెంట నీళ్లు పెట్టుకున్నాడు. ''ఇంతదాకా నాతో ఎవ్వరూ ఇట్టా బాగా ఉండలేదు సారూ. పెతి ఒక్కరూ చీదరిచ్చుకునేటోళ్లే. నేను పుట్టంగాల్నే మా యమ్మ చచ్చిపోయిందంట. అంతకంటే ముందే మా నాయన మా యమ్మని వొదిలేసి ఎక్కడికో యెల్లిపోయాడంట. మా తాతే నన్ను పెంచాడు. ఏదో పెద్ద జబ్బు చేసి, మా తాత కూడా చచ్చిపోయాడు. రెండేళ్లయ్యింది. అప్పట్నించీ ఎక్కడో చోట పన్జేస్తా ఎక్కడ వీలుంటే అక్కడ పడుకుంటన్నా'' అని చెప్పుకొచ్చాడు.

చప్పున నా కళ్లల్లోనూ నీళ్లు తిరిగాయి. ఒక మనిషి విషయంలో అంతగా కదిలిపోవడం నాకదే తొలిసారి. మీకు ఆశ్చర్యమనిపించొచ్చు కానీ.. అంతదాకా ప్రేమ కోసం తపిస్తూ, ఒంటరిగా గడపడానికే అలవాటు పడ్డ నేను రంగాలో నా తమ్ముణ్ణి చూశా.

''రంగా. నాతో ఇక్కడే ఉంటావా. నీకు నేను చదువు చెబుతా'' మనస్ఫూర్తిగా చెప్పా. వాడు మరోసారి అపనమ్మకంగా నా వొంక చూశాడు.

''వొద్దు సారూ. మీకెందుకు కష్టం. నా గురించి నాకేమీ దిగుల్లేదు. ఏదో ఓ పన్జేసుకుని, బతుకుతా'' అన్నాడు పెద్ద మనిషిలా. అంత చిన్న వయసులోనే జీవితం వాడికి చాలా నేర్పింది. కానీ నేను పట్టు వదల్లేదు. చివరికి ఒప్పుకున్నాడు. తొందర్లోనే వాడి దెబ్బలు మాయమయ్యాయి. వాడి కోసం ఒక పరుపు కొన్నా, పడుకోడానికి. రోజూ నాకంటే ముందే లేచి, టీ కాచి ఇచ్చేవాడు. అప్పటిదాకా ఉదయం టిఫిను, మధ్యాహ్నం భోజనం బయటే నాకు. సాయంత్రం మాత్రం రూములో వండుకునేవాణ్ణి. ఇప్పుడు రంగా రోజుకో టిఫిను చేస్తున్నాడు. భోజనానికి మధ్యాహ్నం ఇంటికే వొస్తున్నా. సాయంత్రం మాత్రం వాణ్ని వంట వద్దకి రానిచ్చేవాణ్ణి కాను. రోజూ సాయంత్రాలు వాడికి అక్షరాలు నేర్పడం డ్యూటీగా పెట్టుకున్నా.

రంగా ఒళ్లు ఎంత చురుకైనదో, మెదడు కూడా అంత చురుకైనదే. నెల తిరిగేసరికి వాడు గుణింతాలతో సహా అక్షరాలన్నీ నేర్చుకున్నాడు. చిన్నచిన్నగా పదాలు చదువుతున్నాడు.

ఒక ఆదివారం రంగాని తీసుకుని ఎగ్జిబిషన్‌కి వెళ్లా. అక్కడి షాపులన్నీ కలియ తిరిగాం. వాడికి రెండు టీషర్టులు కొనిపెట్టా. గన్‌తో బెలూన్లని పగలగొట్టే ఆట ఆడిచ్చా. వాడెంతటి గురికాడో తెలిసింది. పది షాట్లలో తొమ్మిదింటిని ఏ బెలూన్‌ని కొట్టమంటే దాన్నే గురిచూసి కొట్టాడు. ఆ తర్వాత పులిబొంగరాలు తిన్నాం. మాటిమాటికీ వాడి చూపు జెయింట్ వీల్ మీదికి వెళ్తుండటం గమనించి, టిక్కెట్లు తీసుకుని అదెక్కాం. జెయింట్ వీల్ ఎక్కడం వాడితో పాటు నాక్కూడా అదే తొలిసారి. వీల్ తిరుగుతుంటే వాడు దాన్ని బాగా ఆస్వాదించాడు. నాకైతే కళ్లు తిరిగాయి. కిందికి దిగాక కడుపులో ఒకటే వికారం. వాంతి వొస్తున్నట్లు అన్పిస్తున్నా గొంతుదాటి బయటకు రావడం లేదు.

అట్లాగే బైక్ స్టార్ట్ చేశా. బెంజి సర్కిల్ దాటా. పడమట లంక కూడా దాటి ప్రకృతి చికిత్సాలయం వైపు టర్న్ తీసుకున్నా. ఎదురుగా ఏదో బండి హెడ్‌లైట్ల వెలుతురు కళ్లల్లో పడి, మంట పుట్టించింది. అది యమ స్పీడుగా వొస్తున్న టాటా సుమోదని తర్వాత తెలిసింది. ఓ వైపు కడుపులో వికారం, ఇంకోవైపు మండుతున్న కళ్లు.. అంతే! ఏమైందో తెలీదు. బైక్ బ్యాలెన్స్ తప్పింది. దబ్బున కింద పడ్డం వరకే నాకు జ్ఞాపకం. కళ్లు తెరిచేసరికి ఆస్పత్రిలో ఉన్నా. కాలికి బ్యాండేజ్‌తో. రంగా కోసం అటూ ఇటూ చూశా. నేను స్పృహలోకొచ్చినట్లు గమనించి వొచ్చిన డ్యూటీ నర్సుని అడిగా వాడి కోసం.

ఆమె పెదవి విరిచి ''బాడీ మార్చురీలో ఉంది. తల పగిలిపోయింది. స్పాట్ డెడ్'' అంది, చాలా మామూలుగా.

అప్పుడు నేననుభవించిన బాధ, వేదన మాటల్లో చెప్పలేను. మూడు నెలల్లో నాకు తగిలిన దెబ్బలన్నీ మానిపోయాయి. కాలి కట్టు కూడా తీసేశారు. ఈ మధ్యలో మా అమ్మానాన్నలు నన్ను చూసేందుకు వొచ్చారు. ఇంటికి తీసుకెళ్లారు. పది రోజులు కష్టంగా ఉన్నా. ఎవరితో మాట్లాడేవాణ్ణి కాదు.

''ఏంటి నీ బాధ?'' అడిగింది అమ్మ. నేను చెప్పా. నా వొంక ఎగాదిగా చూసి ''ఎవడో ఏమిటో తెలీని వాడెవడో చచ్చాడంట. దానికి పెళ్లామో, కొడుకో చచ్చినట్లు వీడు బాధ పడ్తున్నాడు'' అంది కోపంగా.

ఆమె మాటలు నన్ను విపరీతంగా బాధించాయి. వాళ్లకి డబ్బు గురించీ, ఫాల్స్ ప్రెస్టేజ్ గురించీ తప్ప అనుబంధాల విలువ తెలీదని అర్థమైపోయింది. ఎలాగో చిన్నగా నా పనులు నేను చేసుకో గలుగుతున్నా కాబట్టి అక్కడ ఉండలేక బలవంతంగా విజయవాడ తిరిగెళ్లిపోయా. కాలు పూర్తిగా నయం కావడానికి మూడు నెలలు పట్టింది. కానీ రంగా జ్ఞాపకాలు మాత్రం నన్ను వదల్లేదు. ఎప్పటికీ వదలవని నాకు తెలుసు.

రోడ్డు మీద అడుక్కుతినే పిల్లల్లో, చెత్త ఏరుకునే పిల్లల్లో రంగా కనిపించేవాడు. ఎన్నోసార్లు కలల్లోకీ వొచ్చాడు. నవ్వుతూ పలకరించాడు. ప్రశాంతంగా ఉండలేకపోతున్నా. అనాథ పిల్లల కోసం ఏమైనా చెయ్యాలి. ఏం చెయ్యాలి? ఇదే ఆలోచన. అప్పుడు తట్టింది ఈ 'అంకురం' పెట్టాలనే ఆలోచన.

రంగా నా వల్లే చనిపోయాడు కాబట్టి దానికి నిష్కృతిగా మాత్రం దీన్ని పెట్టలేదు. సమాజ ఆదరణకి నోచుకోక రోడ్ల పాలై, సరైన తిండీ తిప్పలు లేక అనారోగ్యాలతో బాధపడే పిల్లల్ని ఆదరిస్తే.. వాళ్లకి చదువూ సంధ్యలు కల్పిస్తే.. వాళ్లూ మనలా ప్రయోజకులవుతారనే భావనే నన్నీ పనికి పురికొల్పింది. చెప్పాలంటే ఒకప్పుడు నేను అందరూ ఉన్న అనాథని. కానీ ఇప్పుడు.. వీళ్లంతా నా పిల్లలు, నేను వాళ్లకి తండ్రినీ, అన్ననీ.

***

కొంత సేపటిదాకా బసవరాజుకి కానీ, చిరంజీవికి కానీ నోట మాట పెగల్లేదు. వాళ్ల మనసుల్లోని మిస్టరీ వీడిపోవడమే కాదు, భరద్వాజ కథ, అతని గొప్పతనం వాళ్ల మనసుల్లోని మాలిన్యాన్నీ తొలగించి వేసింది. వాళ్లకి తెలీలేదు. తమ కళ్లు చెమ్మగిల్లాయని.

''నిజంగా మీరెంతో గొప్పవాళ్లు'' చేతులు జోడించాడు బసవరాజు. చిరంజీవి కూడా. అయితే అతనిలో ఇంకా ఒక చిన్న సందేహం. అడగాలా, వొద్దా.. అన్న మీమాంస.

''మీరేదో అడగాలని ఆగిపోతున్నారు?'' అన్నాడు భరద్వాజ, అది గమనించినట్లే.

''మీరు పెళ్లెందుకు చేసుకోలేదు? మీకు సెక్సు కోరికలు కలగవా?'' అడిగాడు చిరంజీవి, ధైర్యం చేసి.

''నా ఆశయానికి అడ్డవుతుందనే చేసుకోలేదు. ఇక లైంగిక వాంఛలు అంటారా. నేనూ మామూలు మనిషినే. కలగకుండా ఎలా ఉంటాయ్. కానీ వాటిని అదుపులో పెట్టుకుంటున్నా. వాటికంటే నాకు నా పిల్లలే ప్రధానం. వాంఛ ఉండేది కొద్ది క్షణాలే. ఆ క్షణాల్లోనే నా ఆశయం నాకు గుర్తుకొస్తుంది. అందువల్ల ఆ వాంఛలు నన్నేమీ బాధించవు'' నవ్వుతూ చెప్పాడు.

చిరంజీవి హృదయం తేలికైంది. ఆ తర్వాత బసవరాజుతో పాటు అతనూ 'అంకురం' ట్రస్టులో జీవిత సభ్యుడయ్యాడు. ఇప్పుడు 'అంకురం'కి ఆర్థికంగా ఏ లోటూ లేదు.

✻

**రచయిత సెల్ నెం: 9985404949**



## షీలాకి నిర్మాత అండ...

దర్శక నిర్మాతల అండదండలు లేకుండా హీరోయిన్లు సినీఫీల్డులో నిలదొక్కుకోలేరన్న సంగతి అందరికీ తెలిసిందే! షీలాకు కూడా అలాంటి అండదండలే దక్కాయని టాలీవుడ్‌లో పుకార్లు షికారు చేస్తున్నాయి. తాను తీసే సినిమాల్లో షీలానే హీరోయిన్‌గా ఉండాలని ఆ నిర్మాత పట్టుపడుతున్నట్లు పలువురు చెబుతున్నారు. 'పరుగు' తరువాత పెద్దగా సక్సెస్‌లు లేక ఫ్లాప్ హీరోయిన్‌గా ముద్రపడిన షీలా ఆ నిర్మాత కంట్లో పడడంతో ఆమె పంట పండిందనీ, ఇక అవకాశాల కోసం వెతుక్కోనక్కర్లేదనీ, ఆ నిర్మాత ఆస్థాన హీరోయిన్‌గా ఎంచక్కా సెటిల్ అయిపోవచ్చనీ వారు అంటున్నారు. దీనిపై షీలాని అడిగితే, ''నా దాకా అలాంటి కామెంట్స్ రాలేదు. కాబట్టి నో కామెంట్'' అని తప్పించుకుంది.